# సైకత కుంభం

వసంతకాలపు అరణ్యం. ఎన్ని రంగులో ఎన్ని పరిమళాలో! అక్కడక్కడా ఉన్న మామిడి చెట్లనుంచి మత్తెక్కించే వాసన. కోకిలల సుస్వరాలు. సీతాదేవి మొదటిసారి వసంతకాల మహిమను కళ్ళారా చూస్తోంది. మనసారా అనుభవిస్తోంది. అలాంటి రోజుల్లో ఒక సుప్రభాత సమయాన దగ్గరలో ఉన్న ఆశ్రమంలోని స్త్రీలంతా గుంపుగా వెళ్ళటం చూసింది. వాళ్ళంతా ఒకేసారి ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవాలనే కుతూహలం తీరలేదు. పిలుద్దామని అనుకునేలోగా పిలుపు కందనంత దూరం వెళ్ళిపోయారు. లక్ష్మణుడిని అడిగితే తనకూ తెలియదనీ సాయంత్రం వాళ్ళు వచ్చేటపుడు అడిగి తెలుసుకుందామని అన్నాడు. సాయంత్రం వాళ్ళెపుడు వచ్చారో తెలియనే లేదు. గుంపుగా వెళ్ళినవాళ్ళు ఎవరికి వారు వచ్చినట్లున్నారు. మర్నాడు ఉదయం పనులు పూర్తయ్యాక రామ లక్ష్మణులు అరణ్యం లోపలికి వెళ్లొస్తామని వెళ్ళాక, సీత దగ్గరలో ఉన్న శాంత ఆశ్రమానికి వెళ్ళింది.

వెళ్తూనే ఆశ్చర్య పోయింది. అంతకు ముందు శాంత కుటీరంలో లేని అందమైన శిల్పాలు రెండు, చిత్రమైన బొమ్మలతో ఆకర్షణీయంగా ఉన్న కుండలు ఐదారు, చక్కగా అమర్చి ఉన్నాయి. సీత వాటిని చూసి ఆనందిస్తూ "ఇవి ఎక్కడివి శాంతా? మొన్న నేనొచ్చినపుడు లేవు కదా" అనడిగింది.

"నిన్న మేమంతా రేణుకాదేవి శిల్పాలయానికి వెళ్ళాం కదా. నాకు నచ్చినవి తెచ్చాను" అంది శాంత.

"రేణుకా దేవా?" అంది సీత. ఆమెవరో తనకు తెలియదనే ధ్వనితో.

"నీకు తెలియదులే సీతా, మీరిక్కడికి వచ్చి కొద్ది రోజులే అయింది గదా. ఇక్కడికి ఒక ఘడియ నడక దూరంలోనే రేణుకాదేవి శిల్పాలయం ఉంది. ప్రతి సంవత్సరం మేమంతా వెళ్ళి మాకు కావలసిన కుండలు, రాతి పాత్రలు అందమైన శిల్పాలు తెచ్చుకుంటాం. నిన్న వెళ్ళాం. నిన్నూ పిలవాల్సింది." అంది శాంత.

"రేణుకా దేవి అనే ఆవిడ దగ్గర ఇంత విద్య ఉందా!" ఆశ్చర్యంగా అంది సీత.

"ఔను. ఇవేంటి. ఇంతకు మించిన శిల్పాలెన్నో ఉన్నాయి. శిల్పవిద్యా రహస్యాలన్నీ ఆమె కరతలామలకం. ఒక్కసారి పని మొదలెడితే యిక తపస్సులో మునిగినట్లే. తపస్సులో కూడా అంత లీనమయ్యే రుషులు తక్కువమందే ఉంటారు. నువ్వు చూస్తుండు సీతా- నేను రెండు కడవల నీళ్ళు తీసుకుని యిప్పుడే వచ్చేస్తాను" అంటూ శాంత బైటికి వెళ్ళింది.

రేణుకాదేవి- ఆ పేరు సీత మనసులో పాత జ్ఞాపకాలనేవో రేపింది.

ఈ పేరు తనకింతకు ముందు పరిచయమే. ఎప్పుడు- ఎక్కడ- సీతకు తన స్వయంవరం గుర్తొచ్చింది. స్వయంవరంలో రాముడు శివుని విల్లు విరిచాక తను రాముని మెడలో విరిదండనలంకరించి తిరిగి అంతఃపురంలోకి వెళ్ళబోతుండగా చెలరేగిన కల్లోలం గుర్తొచ్చింది.

ఎవరతను? కోపంతో మండిపడుతూ అగ్నిపర్వతంలా దూసుకొచ్చాడు. రామునిమీద ప్రళయకాల మేఘంలా విరుచుకు పడ్డాడు.

అంతఃపుర స్త్రీలు తనను లోపలికి తీసుకెళ్ళారు. అక్కడ వారి మాటలు సీత జ్ఞాపకం తెచ్చుకోటానికి పెనుగులాడుతోంది.

"మహా వీరుడు పరశు రాముడు. భూమిమీద క్షత్రియులను బ్రతకనివ్వనన్న పరశురాముడితనే- ఇప్పుడేం జరుగుతుంది. ఆ శ్రీరామచంద్రుడిని ఏం చేస్తాడీ బ్రాహ్మణుడు?" చెలికత్తె మాటలకు ఒణికిపోయింది తను.

"మహావీరుడే కాదు. అతి కఠినాత్ముడు. తన తల్లి రేణుకాదేవి తల నరకటానికి వెనుదీయని క్రూరుడు" ఒక ముత్తయిదువ ఆక్రోశించింది. తను భయంతో మరింత కంపించింది. తనను గమనించి అందరూ మాటలాపారు. తనను ఊరడించటం మొదలు పెట్టారు. రాముని గురించిన దుఃఖంలో తను కన్నీరు కారుస్తోంది. రాముని చూడగానే తనలో కలిగిన పారవశ్యం, అతని ప్రతాపం చూసి పొందిన గర్వానుభూతి, అతికొద్ది

సమయంలో అతనే సర్వస్వం అని తనలో కలిగిన భావన- వీటన్నిటికీ ఎక్కడ విఘాతం కలుగుతుందోననే భయం. రాముని ప్రతాపం మీద విశ్వాసం లేకకాదు. వీళ్ళంతా చెబుతున్న పరశురాముని పరుషత్వం సీతను కన్నీరు కార్పించింది. కన్నతల్లిని కడతేర్చబోయాడట. సీత తల తిరిగింది.

ఇంతలో మరో ఇద్దరు సఖులు పరిగెత్తుకుంటూ వచ్చారు.

"పరశురాముడు శాంతించాడు. రాముని ప్రతాపాన్ని ఆమోదించాడు. ఇరువురికీ స్నేహం కుదిరింది. ఏవో ఒప్పందాలు చేసుకున్నారు"

ఆ కబురుతో తనకు పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది. తర్వాత తండ్రి వచ్చి తనను పరామర్శించి, జరిగినదంతా మంచికేననీ, రాముని ప్రతాపం తిరుగు లేకుండా నిరూపించబడిందనీ, అలాంటి వీరుడ్ని భర్తగా పొందిన తను అదృష్టవంతురాలనీ దీవించి వెళ్ళాడు.

పెళ్ళి సందడి తగ్గాక, కొన్ని నెలలు గడిచాక వివాహ విశేషాలు తల్చుకుంటున్నపుడు పరశురాముని సంగతి అడిగింది తను. రాముడు పరశురాముని కీర్తించటంలో మునిగిపోయాడు.

"క్షత్రియులను సంహరించిన వాడిని అంతపొగుడుతున్నారే" అంది తను.

"ఆయన సంహరించిన క్షత్రియులు ఆర్యధర్మాలను పాటించనివారు. ఈ ఉత్తరాపథమంతా ఆయన ఆర్యధర్మాలను తిరుగు లేకుండా స్థాపించాడు. నా ఆలోచనలు తెలుసుకోటానికి వచ్చాడు. శివధనుర్భంగం చేసిన నేను ఆర్యధర్మాలను కొనసాగిస్తే బాగుంటుందని ఆయన ఆలోచన. నాకు ఆర్యధర్మాలు శిరోధార్యాలని తెలిసి సంతోషపడ్డాడు. నన్ను తన వారసునిగా స్వీకరించి, దక్షిణాపథమంతా ఆ ధర్మాలను పాటించే బాధ్యత నాకు అప్పగించి వెళ్ళాడు."

"మీరు దక్షిణ దేశంలో ఎలా-" సీత మాటలు పూర్తికాకుండానే

"జరగవలసింది జరుగుతుంది- ప్రశ్నలెందుకు" అన్నాడు రాముడు.

"కానీ అతను తల్లిని సంహరించబోయాడట"

"తండ్రి ఆజ్ఞ అది. ఏమి చేస్తాడు. పితృవాక్య పరిపాలనకంటే పరమధర్మం ఉందా?"

తమ మాటలు పూర్తి కాకుండానే దశరధుని నుంచి రామునికి పిలుపు వచ్చింది. వెళ్ళి తిరిగి వచ్చి పట్టాభిషేక శుభవార్త చెప్పాడు. మందిరమంతా ఆనంద కోలాహలం.

కానీ మరునాడు అంతా తల్లకిందులయింది. తామిలా వనవాసం రావటానికి అంకురార్పణ జరిగి పట్టాభిషేకం కలగా మిగిలింది.

మళ్ళీ ఇన్నాళ్ళకు ఈ వనసీమలో రేణుకాదేవి పేరువల్ల పరశురాముని జ్ఞాపకాలు కదలబారాయి. పరశురాముడు సంహరించబోయిన రేణుకాదేవి ఈమేనా?

***

ఈ ప్రశ్నకు సమాధానం సీతకు కొద్ది కాలంలోనే దొరికింది. అనుకోకుండా సీత రేణుకాదేవిని కలిసింది.

నదీ స్నానానికి వెళ్ళిన సీతకు అక్కడ ఇసుకను, మట్టిని కుండలలోకి నింపుతున్న స్త్రీలు కొందరు కనిపించారు. ఆ స్త్రీలలో కొట్టొచ్చినట్టున్న తేజస్సుతో ఉన్న స్త్రీని చూసి ముచ్చటపడింది సీత.

పెద్ద వయసయినా దృఢంగా ఉన్న శరీరం. తెల్లని శిరోజాలు. విశాలమైన కళ్ళలో ఒక పట్టుదల. ప్రశాంతమైన ముఖం. పెదవుల మీద సంతృప్తితో కూడిన చిరునవ్వు. సీత ఒక నిముషం కళ్ళార్పకుండా ఆమెనే చూసింది.

ఆమె సీతతోపాటు నదిలో దిగి స్నానం చేస్తూ "నిన్నెప్పుడూ చూడలేదే- ఎవరు నువ్వు. ఈ ప్రాంతాలకు కొత్తగా వచ్చావా" అని అడిగింది.

సీత తన వివరాలు చెప్పింది.

"ఆర్య ధర్మాలను అరణ్యాలలో కూడా విస్తరించటానికి బయల్దేరిన రాముడి భార్యవా" అన్నది రేణుక కొంత తిరస్కార స్వరంతో.

"పిత్రువాక్య పరిపాలన కోసం ఆయన అరణ్యాల కొచ్చారు" ఆ తిరస్కారాన్ని లెక్కచెయ్యకుండా స్థిరంగా చెప్పింది సీత.

"అది కూడా ఆర్య సంస్కృతిలో భాగమేలే. తండ్రి చెప్పింది న్యాయమా అన్యాయమా అని ఆలోచించకుండా గుడ్డిగా పాలించటమే ఆర్యధర్మం. నా కుమారుడు అదే చేశాడు. ఆ పనే తానూ చేస్తానని, దేశంలోని ఇతర జాతులలో కూడా అదే ఆర్య ధర్మాలు స్థాపిస్తాననీ నీ భర్త నా కుమారుడికి వాగ్దానం చేశాడు". ఆమె మాటల్లో గాంభీర్యం, హుందాతనం.

'మీరు రేణుకాదేవా?" సీతకు సందేహం లేకపోయినా అడిగింది.

"ఔను, నా గురించి వినే ఉంటావు. నా ఆశ్రమానికి వెళ్దాం రా" ఆజ్ఞాపిస్తున్నట్టే అన్నది రేణుక.

"క్షమించండి. నేను రాను." సీత వినయంగానే చెప్పింది.

రేణుక గలగలా నవ్వింది. నదే నవ్వినట్లనిపించింది సీతకు.

"నీ భర్త వద్దంటాడనా?"

"లేదు. లేదు. ఆయనతో మీ గురించి మాట్లాడనే లేదు."

"మరి సందేహం ఎందుకు? రా వెళ్దాం." రేణుక ఒక తల్లిలా తీసుకుంటున్న చనువు సీతకు కొత్తగా ఉంది.

సమాధానం చెప్పకుండా నిలబడింది.

"నాతోపాటు ఆశ్రమానికిరా. అక్కడ ఎన్నో శిల్పాలు, చిత్రాలు, నీకు నచ్చుతాయి. నువ్వు ఆనందిస్తావు."

"ఇంకొకసారి శ్రీరామచంద్రుని అనుమతి తీసుకుని వస్తాను."

"నీ భర్త అనుమతించడు" మళ్ళీ నవ్వింది రేణుక.

"మీకెలా తెలుసు?" చురుగ్గా అడిగింది సీత.

"భర్తల గురించీ కుమారుల గురించి నాకు తెలిసినట్లు మరెవరికీ తెలియదు". రేణుక నవ్వు నురగలై తేలుతోంది.

"మీ భర్తా, కుమారుడు మీకు అన్యాయం చేసి ఉండవచ్చు. అంతమాత్రాన అందరూ అలాంటివారేననుకోవటం న్యాయం కాదు. నేనింకోసారి మీ ఆశ్రమానికి వస్తాను."

సీత రేణుకకు నమస్కరించి మరి మాటలకు ఆస్కారం లేదని చెప్పకనే చెప్పి వెనుదిరిగింది.

***

సీత మనసులో రేణుక రూపం ప్రతిష్ఠించుకు పోయింది. ఆమె మాటల్లో చనువు, నవ్వులో అధికారం మరీ మరీ గుర్తొస్తున్నాయి. తల్లిలా పిలిచింది. ఒకసారి వెళ్ళివస్తేనేం- రామలక్ష్మణులు అరణ్యంలోకి వెళ్ళిన రోజు తనొక్కసారి రేణుకాదేవి ఆశ్రమానికి వెళ్ళి వస్తే ఏమవుతుంది?

సీతకు రేణుకాదేవి శిల్పాలయం చూడాలనీ ఆమెతో మాట్లాడాలనీ కోరిక పెరిగిపోతోంది.

రాముడితో చెప్పింది.

"ఇక్కడికి దగ్గరలో ఒక శిల్పాలయం ఉందట. కొన్ని రోజులకిందట మునిపత్నులందరూ వెళ్ళి శిల్పాలు, కుండలు తెచ్చుకున్నారు. ఎంత అందంగా ఉన్నాయని. నేనూ వెళ్ళి తెచ్చుకుంటాను".

"ఔను, శిల్పాలయం సంగతి నేనూ విన్నాను. కానీ- నువ్వెందుకు? లక్ష్మణుని తీసుకు రమ్మందాం. అవన్నీ నువ్వు మోసుకుని రాగలవా?" అన్నాడు రాముడు.

'అన్నీ చూసి నచ్చినవి ఎంపిక చేసుకుంటాను. అవి ఇక్కడికి చేరవేసే సంగతి తర్వాత చూడవచ్చు" అంది సీత.

"అలాగే- వెళ్ళి నీకు నచ్చినవన్నీ ఎంచుకో" అన్నాడు రాముడు. రేణుకాదేవి సంగతి రామునికి తెలుసో లేదో- శిల్పాలయం గురించి తెలుసన్నాడు గనుక తెలిసి ఉండొచ్చు. పరశురాముని తల్లి మీద రాముడికి పూజ్యభావం ఉండొచ్చు. ఆమె పరశురాముని ధర్మాలనూ రాముని ధర్మాలనూ నిరసిస్తుందనే సంగతి రాముడికి తెలియక పోవచ్చు. తనకు తెలిసింది మాత్రం ఎంత?

రేణుకాదేవిని కలిస్తే తప్ప ఆమె అభిప్రాయాలు పూర్తిగా తెలియవు.

సీత శిల్పాలయం వెళ్ళేందుకు త్వరత్వరగా పనులు ముగించుకో సాగింది.

శాంత చెప్పిన గుర్తులతో సులభంగానే రేణుకాదేవి ఆశ్రమం చేరింది. రేణుక పనిలో మునిగి ఉంది. ఆమెతో పాటు మరి కొందరు స్త్రీలు కూడా మట్టితో, యిసుకతో పనులు చేస్తున్నారు. సీతను చూసి అంత పనిలోంచి లేచి వచ్చింది రేణుక.

"నీ భర్త అనుమతి తీసుకునే వచ్చావా?" అంటూ నవ్వింది.

"ఔను. వారి అంగీకారంతోనే వచ్చాను. అందులో వింతేమిటి? పొరపాటేముంది? మీరు చూపుతానన్న శిల్పాలు చూపుతారా?" అంది సీత.

రేణుక అప్యాయంగా నవ్వుతూ సీతను శిల్పాలయంలోకి తీసుకెళ్ళింది. అక్కడి శిల్ప సంపద చూసి సీతకు నోట మాట రాలేదు. మిధిలలో, అయోధ్యలో రాజ భవనాల్లో పెరిగిన సీతకు శిల్పాలు, వాటి సౌందర్యం తెలియనిది కాదు. కానీ ఈ శిల్పాలు, వీటి తీరే వేరు. ఈ శిల్పశైలి తనెన్నడూ చూడలేదు. పూర్తి భిన్నంగా ఉంది. ఆ మాటే అంది-

"ఇవి స్త్రీలు చెక్కిన శిల్పాలు. నేనూ నా శిష్యురాళ్ళు చెక్కినవి. భిన్నంగానే ఉంటాయి. అమూర్తంగానే ఉంటాయి." సీతను మరో చోటికి తీసుకెళ్ళింది.

"ఇవిగో ఇక్కడ నీవు ఎప్పుడూ చూసే శిల్పాలున్నాయి."

అవికూడా సౌందర్యం ఉట్టిపడుతూ ఉన్నాయి. ఆ సౌందర్యంలో కూడా ఒంపుసొంపులకంటే బలం, నిగ్రహం, హుందాతనం కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి.

సీత తనకు కావాలని కొన్ని శిల్పాలను ఎంచుకుంది.

"సామాన్యంగా స్త్రీలు శిల్పవిద్యలోకి ప్రవేశించరు గదా ఇది మీకెలా అబ్బింది. ఎవరి దగ్గర నేర్చుకున్నారు?"

"చిన్నతనం నుంచీ ఆసక్తి. గురువులెవరూ లేరు. నాకు నేనే గురువుని". నవ్వి రేణుక సీతకు ఫలహారం తెచ్చి పెట్టింది.

"ఇదిగో యిది నీకు ప్రత్యేకంగా యిస్తున్నాను. ఇది యిసుకతో చేసిన కుండ. సైకత కుంభం." ఒక అందమైన కుండను సీత చేతికందించింది.

"ఇసుకతో కుండా-"

"ఔను. ఈ విద్య నా కొక్కదానికే వచ్చు"

"అద్భుతంగా ఉంది."

"ఔను అద్భుతమే. ప్రతి స్త్రీ దగ్గరా ఇది ఉండాలి" నవ్వింది రేణుక.

"ఎందుకు"

"తమ పాతివ్రత్యాలు ఈ సైకత కుంభాలవంటివేనని తెలుసుకుంటే వాళ్ళు నిశ్చింతగా బతకగలగుతారు."

సీతకు అర్థం కాలేదు. అయోమయంగా చూసింది.

"ఈ కుండ చేయటానికి ఎంతో ఏకాగ్రత కావాలి. నా ఏకాగ్రత గురించి తెలియని వాళ్ళంతా నా పాతివ్రత్యంతో యిసుక కుండ తయారు చేస్తున్నాననుకున్నారు. నా పాతివ్రత్యానికేమీ లోపం లేదు గనుక అనుకోనిమ్మని నేనూ ఊరుకున్నాను. ఏకాగ్రత ఎప్పుడైనా భగ్నం కావచ్చు. కారణం ఏదైనా కావచ్చు. నా విషయంలో ఒక పురుషుడు కారణమయ్యాడు. ఆ పురుషుని చూసినంత మాత్రానే నా పాతివ్రత్యం భంగపడిందని నా భర్త ఆగ్రహించాడు. కుండ చక్కగా చేయటానికి సాధన, ఏకాగ్రత, ఇసుక, దానిలో

కలిసిన నీటి పాళ్ళు యింకా ఎన్నో కారణాలుంటాయి. అది గ్రహించలేని మహాజ్ఞాని జమదగ్ని మహర్షి. తపస్సు ద్వారా ఎంత జ్ఞానం సంపాదించినా భార్య పాతివ్రత్యంపై పట్టు వదలని ముముక్షువులు."

రేణుక మాటల్లో కఠినమైన వ్యంగ్యం.

"అప్పుడేం జరిగింది" సీత ఆతృతగా అడిగింది.

"నన్ను చంపమని కుమారులను ఆజ్ఞాపించాడు. పరశురాముడు అందుకు సిద్ధమయ్యాడు. నా శిరస్సు నరికాడు. సగం తల తెగిన తర్వాత నా భర్త ఆగ్రహం తగ్గింది. పరశురాముని ఆగమన్నాడు. ఆశ్రమ స్త్రీలు, అరణ్యాలలో నివసించే తెగల స్త్రీలు నాకు వైద్యం చేసి నా తలను మెడమీద నిలిచేలా చేశారు. నెలల పర్యంతం నేను చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడాను. మృత్యువు దాకా వెళ్ళిన నా ముందు మూడు మూర్తులు- మనసా, వాచా, కర్మణా సేవించిన నా భర్త- ఆయనపట్ల నా పాతివ్రత్యం, పదినెలలు మోసి, కని పెంచిన కుమారుడు - నా మాతృత్వం, నా ఏకాగ్రతకు ఫలితం నా విద్య- ఈ యిసుక కుండ. ఈ మూడూ ఒకటే. అల్ప కారణంతో చిన్నాభిన్నమౌతాయి. జీవితం కత్తి అంచున వేలాడుతుంది."

సీత కళ్ళ నిండుగా నీళ్ళు. రేణుక మాత్రం గంభీరంగా ఉంది.

"ఆ చావు బతుకుల పోరాటంలో ఎన్నో ప్రశ్నలు. భర్త, కుమారులు అనే బంధాలు స్త్రీలకు అవసరమా అని- అవసరం లేదనుకుని నేను వారందరినుంచీ దూరంగా వచ్చేశాను. నా విద్యతో బతుకుతున్నాను. నా శిష్యులకూ అదే ఉపదేశం యిస్తాను. ఎప్పుడైనా తప్ప ఇసుకతో కుండ చెయ్యను. పాతివ్రత్యం ఎలాంటిదో మర్చిపోకూడదని ఎప్పుడైనా చేస్తుంటాను"

"భర్త తప్ప స్త్రీకి వేరే ప్రపంచం ఉందా? మాతృత్వం కంటే పరమార్థం స్త్రీలకేముంది? మీ అనుభవంతో అందరికీ ఆ ఉపదేశం చేయటం–".

"భర్త తప్ప వేరే ప్రపంచం లేదనుకుంటారు స్త్రీలు. నిజమే. కానీ ఏదో ఒకరోజు భర్త తన ప్రపంచంలో నీకు చోటు లేదంటాడు. అపుడు మనకు ఏ ఆధారం ఉంది- పుత్రులకు జన్మ నివ్వటమే జీవిత గమ్యమనుకుంటాం. ఆ పుత్రులు పురుషుల వంశాంకురాలై మనం గ్రహించేలోపే మన చేయి వదిలి తండ్రి ఆధీనంలోకి వెళ్తారు. వారి ఆజ్ఞాబద్ధులవుతారు. లేదా వారే మన జీవితాలకు శాసనకర్తలవుతారు. ఎందుకు ఆ పిల్లల్ని కనటం- ఇది నాకు అనుభవమైనంత కఠోరంగా మరింకెవరికీ అవదు. ఆ

కఠోర సత్యం తెలిశాక చెప్పటం నా విధి కదా- అయినా మీ బ్రాహ్మణులెవరూ నా మాటలకు విలువ ఇవ్వరు. ఈ అరణ్యంలో వివిధ జాతుల ప్రజలకు నా విద్య నేర్పుతూ నా అనుభవ సారం చెబుతుంటాను."

"కానీ వివాహబంధం లేకపోతే సృష్టి ఆగిపోదా?"

"ఎందుకాగిపోతుంది సీతా- ఈ అరణ్యంలో ఎన్నో ప్రాణులు పుట్టి పెరుగుతున్నాయి. వాటికి వివాహబంధం లేదే- అనేక తెగల ప్రజలున్నారు. వారి ఆచారాలు మీ ఆచారాలకు భిన్నంగా ఉంటాయి."

"అంటే మానవులు పశువుల్లా, అనాగరికంగా బతకాలా?"

"పశువులపై అంత చిన్నచూపెందుకు సీతా- ప్రకృతిని, పశువులను మనం ప్రేమించాలి. పూజించాలి. సావాసం చేయాలి. అదే మానవ కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని వదిలి ఎవరో రాసిన పుస్తకాలలో వాక్యాలను నాగరికత అనుకుంటావా? నగరం నుంచి అరణ్యానికొచ్చావు. నగరాలు పెంచుతున్న నాగరికతపై అంత పట్టెందుకు. ప్రకృతి మానవుల గురువు కదా."

"మీ మాటలు నా కర్థం కావటం లేదు. అవి స్త్రీలకు హాని చేస్తాయనిపిస్తోంది."

"హాని మాత్రం చెయ్యవు సీతా- బిడ్డ తల్లికి చెందటంలో వాళ్ళకి హానేమీ ఉండదు. బిడ్డలు తమ తండ్రెవరని ప్రశ్నించే సందర్భం, భర్త నీ పిల్లలకు తండ్రెవరని ప్రశ్నించే సందర్భం కొందరు స్త్రీల జీవితాల్లో వస్తుంది సీతా- అప్పటి వాళ్ళ స్థితి తల్చుకో- నా మాటలు నీకర్థమవుతాయి."

"ఎవరికో ఎప్పుడో ఏదో జరుగుతుందని వివాహం లేకుండా ఉండిపోవటం, వివాహం లేకుండా పిల్లల్ని కనటం ఎక్కడైనా ఉందా? అది సదాచారమేనా?" కోపంగా అడిగింది సీత.

"సదాచారమో కాదో- నాకు తోచింది చెప్తున్నాను. ఎవరికైనా అనుభవం నుంచే సత్యం బోధపడుతుంది. వారికి బోధపడిన సత్యం వారు చెబుతారు."

"మీ సత్యం నా సత్యం ఒకటి కాదు."

"కాకపోవచ్చు. ప్రపంచాన్ని చూసినకొద్దీ నా మాటల్లోని సత్యమూ నీకు బోధపడవచ్చు."

సీతకు ఆ చర్చ శుష్కమైన వాదనగా కనిపించింది. సీత విసురుగా లేవటంతో కాలి దగ్గరున్న ఇసుకకుండకు కుడిపాదం తగిలి అది పడిపోయింది. పగిలి పోయింది.

ఈ సంఘటనతో సీత భయపడిపోయింది. రేణుక ముఖంలో కూడా ఆందోళన. రేణుక సీతను దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకుంది-

"నీకెంతో బలం ఉంది సీతా- నా మాట మర్చిపోకు. నీ బలమే నీకు రక్ష. అలాగని నేను ఆశీర్వదిస్తున్నాను."

ఆ మాటతో సీత తనకు తెలియకుండానే రేణుక పాదాలకు నమస్కరించి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

సీత గురించిన ఏదో ఆందోళన మనసుని కలవరపరుస్తుంటే రేణుక అక్కడే కూలబడింది.

***

సీతకు ఇద్దరు కుమారుల పెంపకంతో క్షణం తీరటం లేదు. వాల్మీకి ఆశ్రమంలో ఎనిమిది సంవత్సరాలెలా గడిచాయో కూడా సీతకు గుర్తు లేదు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి వాల్మీకి దగ్గర చదువుకు పంపటంతో కొంత సమయం దొరికింది. ఆ సమయంలో కూడా వారిద్దరి గురించిన ధ్యాసే. వాళ్ళు తిరిగి ఇంటికొచ్చే వరకూ ఏ పని చేస్తున్నా కళ్లు మాత్రం గుమ్మానికి అతుక్కునే ఉంటాయి. వారి ముద్దు మాటలు, రామ కథను పాడే వారి తీయని కంఠ స్వరాలు, చిలిపి అల్లర్లు, వీటితో సీత జీవితం హాయిగానే గడుస్తోంది. ఒక రోజు కుశలవులిద్దరూ మౌనంగా నడిచి, వాకిలి దగ్గర నిలబడి ఉన్న తల్లివంక చూడకుండా లోపలికి వెళ్లారు. చెరొక మూలా మూతి ముడుచుకు కూర్చున్నారు. సీత ఆశ్చర్యంగా లోపలికి వచ్చి ముడుచుకున్న వారి మూతులవంక ముచ్చటగా చూస్తూ.

"ఏమైంది నాయనా ఎందుకలా ఉన్నారు?" అని అడిగింది.

"అమ్మా! మా తండ్రి ఎవరు?"

"అమ్మా! మేం క్షత్రియులమా?"

సీత ముఖం క్షణంలో వివర్ణమైంది. వాళ్లు శ్రీరాముని బిడ్డలని వాళ్ళకు చెప్పే ఉద్దేశం సీతకు లేదు.

ఇవాళ పిల్లలిలా ప్రశ్నిస్తుంటే గుండెలు చిక్కబడినట్టయింది. విలవిలలాడింది మనసు.

"బిడ్డలు తమ తండ్రెవరని ప్రశ్నించే సందర్భం, భర్త నీ పిల్లలకు తండ్రెవరని అడిగే రోజు కొందరు స్త్రీలకు వస్తుంది సీతా- అప్పుడు వాళ్ళ స్థితిని తలుచుకో- నా మాటలు నీకర్థమవుతాయి" రేణుక మాటలు చెవిలో గుసగుసలాడుతుంటే రక్తమంతా ముఖంలోకి అక్కడి నుంచీ శిరసులోకి పోటెత్తింది. ఆ ఉద్వేగం నుంచి బైటపడి స్థిమిత పడటానికి సీతకు కొంత సమయం పట్టింది. మెల్లిగా తనను తాను నిలవరించుకుంది. ఈ ప్రశ్నలు ఇవాళ కాకపోతే రేపు వస్తాయి. సమాధానం చెప్పక తప్పదు. ఆశ్రమంలో ఎవరో తెలిసీ తెలియని వయసులోని పిల్లలు కుశలవులతో ఈ మాటలు మాట్లాడి ఉండవచ్చు. పిల్లలు అయోమయంతో, తెలియని బాధతో వచ్చారు. వారికి సమాధానం చెప్పగల శక్తి తన పుత్రులకు కలిగించాలి. సీత పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుంది.

"మీరు క్షత్రియ పుత్రులే నాయనా" అంటూ యిద్దరినీ ముద్దాడింది.

"మరి మా తండ్రి" ఇద్దరూ ఒక్కసారే అడిగారు.

"మీ తండ్రి సాకేతుడనే మహా వీరుడు. ప్రజలకు హితం చేసే ఒక మహా కార్యంలో నిమగ్నమై ఉన్నాడు. అదెంత పెద్ద పనంటే ఆ పనిలో ఆయనకొక్క క్షణం విరామం దొరకదు. కొన్ని సంవత్సరాల పాటు ఆ మహాకార్యం తప్ప మరేది పట్టించుకునే వీలులేదు గనుకనే మనల్ని వాల్మీకి తాతయ్య దగ్గర ఉంచారు."

"ఏం పని అమ్మా అది" అమాయకంగా ఉన్న కుశుడి ముఖంలో ఆ పని గురించిన గౌరవం తొణికిసలాడింది.

"ఈ లోకంలో ప్రజలందరూ ఎలాంటి బాధలూ లేకుండా జీవించాలనే మహా ప్రయత్నం నాయనా. అంతకు మించి నాకూ తెలియదు."

"ఆ పని ముగించాక మన కోసం మా తండ్రి వస్తారామ్మా"

"తప్పకుండా వస్తారు. వచ్చి మిమ్మల్నిద్దరినీ ఎత్తుకుని ముద్దాడి తనతో తీసుకెళ్తారు."

పిల్లలిద్దరి ముఖాల్లో సంతోషం విరబూసి పట్టలేక కిలకిలా నవ్వారు.

"మరి ఇంక వెళ్ళి నా పూజకు పూలు తీసుకురండి" అంది సీత. వాళ్ళిద్దరికీ అక్కడినుంచి కదలాలనిపించలేదు. తమ తండ్రి గురించి మొదటిసారి తెలుసుకున్నారు. ఆయన క్షత్రియుడు. ప్రజల కోసం పెద్ద పని తలపెట్టిన మహానుభావుడు. లవుడికి ఒక సందేహం వచ్చింది.

"అమ్మా- మా తండ్రి వీరుడేనా? క్షత్రియులకు విలువిద్య, యుద్ధ విద్యలు రావాలి కదా- మా తండ్రికి ఆ విద్యలు వచ్చా"

సీత సగర్వంగా నవ్వింది.

"ఆ విద్యలలో మీ తండ్రితో సాటి రాగలవారు ఈ భూమి మీద లేరు".

పిల్లలిద్దరూ తల్లిని కావలించుకున్నారు.

"అమ్మా - మా తండ్రి తన పని ముగించుకుని ఎప్పటికి వస్తాడో. మాకు ఆ క్షత్రియ విద్యలు ఎలా వస్తాయి? ఈ ఆశ్రమంలో మాకెవరు నేర్పుతారు? మా తండ్రి వచ్చి మమ్మల్ని చూసి ఏమనుకుంటారు? ఎలాగమ్మా?"

సీతకు వాళ్ళ ఆరాటం చూస్తుంటే చిరునవ్వు ఆగలేదు.

'మీకు క్షత్రియ విద్యలు నేర్వాలని ఉంది. అంతేకదా- నేను నేర్పుతాను."

"నువ్వా."

"ఏం? నేను కూడా క్షత్రియ స్త్రీనే కదా."

"కానీ స్త్రీలు యుద్ధం చెయ్యరుగా."

"అవసరమైతే స్త్రీలు ఏమైనా చేస్తారు. నాకు అన్ని విద్యలూ వచ్చు. రేపటినుంచీ నేను మీకు అమ్మతోపాటు గురువుని కూడా. సరేనా?" పిల్లలు సంబరంతో గంతులు వేశారు.

వాల్మీకితో చెప్పి సీత లవకుశులకు విలువిద్య నేర్పటం మొదలు పెట్టింది. తల్లి విద్యాకౌశలం చూసి పిల్లలు ఆశ్చర్య పోయారు.

అమ్మ అంటే ఉన్న ప్రేమకు ఈ అమ్మను చూస్తే కలిగే గర్వం తోడయింది. తమ తండ్రి వచ్చేసరికి తాము మహావీరులం కావాలనే ఆలోచన తప్ప మరో ధ్యాస లేకుండా తల్లినుంచి విద్యలు గ్రహిస్తున్నారు. రామాయణం గానం చేస్తూ వాల్మీకి వద్ద సేద తీరుతున్నారు. పెరుగుతున్న పిల్లల్ని చూస్తుంటే సీత మనసులో దిగులు కూడా పెరుగుతోంది. పిల్లలు ప్రతిరోజు ఏదో ఒక వంకన తండ్రి ప్రస్తావన తెస్తూనే ఉన్నారు. తండ్రిని చూడాలనే వారి తహతహ చూస్తుంటే సీతకు గుండెల మీద బరువు పెరుగుతున్నట్లుంది.

"అమ్మా మా తండ్రి మాకెప్పుడు కనపడతారు?" ఒకరోజు లవుడు దీనంగా అడిగాడు.

ఇద్దరు పిల్లల్ని అక్కున చేర్చుకుంది సీత.

"ఇంకొంచెం కాలం ఓపిక పట్టాలి నాన్నా! చెప్పానుగా. కొన్ని కారణాల వల్ల ఆయన అజ్ఞాతంగా బతుకుతున్నారు. ప్రస్తుతం ఆయన ఎవరో ఎవరికీ తెలియకూడదు. సమయం వచ్చినపుడు మీకు తెలుస్తుంది."

ఆ మాటలకే పిల్లలిద్దరి ముఖాలూ ఆనందంతో విచ్చుకున్నాయి.

"ఆ సమయం తొందరగా వస్తే బాగుంటుంది కదమ్మా" కుశుడి ముఖంలో ఏదో తెలియని ఆశ.

"ఇప్పుడు మీకేం లోటు వచ్చిందిరా. తాతయ్యా చదువు చెబుతున్నారు. నేను మీకు విలువిద్య నేర్పుతున్నాను. నేను నేర్పాల్సింది చాలా ఉంది."

"నువ్వు నేర్పాల్సింది పూర్తవగానే మా తండ్రిగారు వచ్చి యింక మిగిలింది నేర్పుతారా?

సీత నవ్వింది.

"నేను నేర్పాల్సిందంతా నేర్పితే మీ తండ్రి నేర్పటానికేమీ ఉండదు"

"అంటే నాన్న కంటే నీకే ఎక్కువ తెలుసా?"

"ఎక్కువ తక్కువలు కాదు నాన్నా! ఒకప్పుడు ఒక గొప్ప ధనుస్సు ఉండేది. దానిని ఎత్తి బాణం వెయ్యగలిగిన వారు అతి తక్కువ మంది. ఆ విద్య నాకూ మీ నాన్నకూ సమానంగానే వచ్చు."

"మాకూ ఆ విద్య నేర్పమ్మా. నాన్న వచ్చేసరికి అది నేర్చుకుని ప్రదర్శిస్తే ఆయన ఆశ్చర్య పోతారు కదమ్మా"

"నాకు చాలా పని వుంది మీతో కబుర్లు చెబుతూ కూర్చోలేను" సీత అక్కడి నుంచి లేచి ఆశ్రమం వెనక్కు వెళ్ళింది. పనిలేదు. కల్పించుకుని చేయాలనే కోరికా లేదు.

తండ్రి కోసం పిల్లలు ఆశపడుతున్నారు. కలలు కంటున్నారు. తను ప్రాణంగా పెంచినా, తండ్రి గురించి ఏమీ తెలియక పోయినా, ఆ తండ్రికి వీరు యిద్దరు పుట్టి పెరుగుతున్నారని తెలియక పోయినా వీళ్ళకు తండ్రి కావాలి. తండ్రి పేరుమీద పుత్రులు పెరగాలి.

తాను జానకి– భూపుత్రి అయినా జనకుడి పెంపకంలో జానకి అయింది. వీరిద్దరూ రాముని పుత్రులుగా గుర్తింపబడితేనే గౌరవం. రాముడు దాశరధి. ఆ పేరంటే ఆయనకు

ఎంతో ఇష్టం. గౌరవం. గర్వం. ఈ పిల్లలకు అలాంటి గుర్తింపు కావాలి. ఇదంతా లోకధర్మం.

కానీ అది జరుగుతుందా? రాముడు ఈ పిల్లలను అక్కున చేర్చుకుంటాడా? తన పేరు యిస్తాడా? తన వంశాంకురాలుగా గుర్తిస్తాడా? అలా జరగకపోతే ఈ పసి హృదయాలెంత బాధపడతాయి.

రాముడు వీరిని పుత్రులుగా స్వీకరించి అయోధ్యకు తీసుకెళ్తే తనేమవుతుంది.?

ప్రాణంగా పెంచిన తండ్రి నుంచి దూరమై రాముని చేయి పట్టుకుంది.

ప్రాణంగా ప్రేమించిన రాముడు తన చేయి వదిలాడు.

ప్రాణంగా కనిపించిన పిల్లల్ని తను- తన చేతుల్తో గట్టిగా పట్టుకోగలదా? పట్టుకోవాలా? పట్టుకుంటే ఉంటారా? తండ్రి పిలిస్తే పరిగెత్తి పోరా?

తన దగ్గర ఏముంది? రాముడు లోకానికి తలవంచి వేసిన నింద తప్ప-

రాముని దగ్గర రాజ్యం ఉంది. తనకోసం కూడా ఒదులుకోలేని మోహం ఆ రాజ్యం. ఈ పిల్లలు ఆ రాజ్యాన్ని తనకోసం ఒదులుతారా? వారి క్షాత్ర రక్తం ఒదులుకోనిస్తుందా?

సీత తన ఆలోచనలతో అల్లకల్లోలమయింది.

తల్లిగా తనకు వీళ్ళమీద ఏ అధికారమూ లేదు. తనకు అధికారం మీద ఎన్నడూ మోజులేదు. ప్రేమ- తండ్రిని ప్రేమించింది. రాముని ప్రేమించింది. పిల్లల్ని ప్రేమించింది. ఏ ప్రేమలోనూ అధికారం లేదు. ఒద్దు.

ప్రకృతి తనకు ప్రసాదించిన పిల్లలు వీళ్ళు. లేడి పిల్లల్లాగానే పెంచింది. పెరిగి పెద్దయిన లేడి పిల్లలు కొన్నాళ్ళకు అడవిలోకి వెళ్ళి మళ్ళీ రావు.

ఈ పిల్లలూ అంతే-

సీత హృదయాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది.

***

లవకుశులు వాల్మీకితో కలిసి అయోధ్యవెళ్ళి పదిరోజులవుతోంది. పదిరోజుల నుంచీ సీత మనసు మనసులో లేదు. అయోధ్యలో ఈ పిల్లలకు శ్రీరామచంద్రుని దర్శనం అవుతుందా? ఆయన వీరిని గుర్తిస్తాడా? వాల్మీకిని ప్రశ్నిస్తాడా? వాల్మీకి చెప్తే

వాస్తవానికి రాముడెలా స్పందిస్తాడు. రాముడే తమ తండ్రి అని తెలిసి పిల్లలెలా స్పందిస్తారు. తమ తల్లి సీత అని తెలుసుకుంటే ఆ పిల్లల ఆనందం మిన్ను ముడుతుంది. కానీ తర్వాత? అక్కడ అంతా తేటతెల్లమై రాముడు పిల్లల కోసం వస్తే- పిల్లలు తనను విడిచి వెళ్తారా? రాముడు తనను రమ్మంటాడా?

రమ్మంటే మాత్రం తను వెళ్తుందా?

పిల్లలు తనను విడిచి వెళ్ళమంటే-

అనరు. తండ్రి అంటే వారికి ప్రేమ. గర్వం.

తను చెప్పిన మాటలతో తండ్రిని దైవంగా భావిస్తున్నారు.

కని, పెంచి తండ్రిని మించిన వీరులుగా తయారు చేసిన ఆ పిల్లలను ఒదులుకోవాల్సిందే. తండ్రి వచ్చి అడిగితే నా పిల్లలనే అవకాశం లేదు. వాళ్ళు రఘువంశానికి చెందుతారు. ఆ వంశాన్ని కొనసాగించాలి.

మళ్ళీ సీతకు రేణుక గుర్తొచ్చింది.

రేణుక మాటలకు ఆనాడు తనకు కంపరం కలిగింది.

ఇప్పుడు రేణుక బాధ అర్థమవుతోంది. రాముడు అగ్ని పరిక్ష కోరిన రోజు, అరణ్యాలకు పంపినరోజు రేణుక చేసిన సైకత కుంభం గుర్తొచ్చింది. అహల్య, రేణుక, తను అందరం అనుమానితలమే. అవమానితలమే.

రాముడు పరిత్యజించటంతో కుంగిపోయిన తనను అహల్యే మళ్ళీ మనిషిని చేసింది.

ఆనాడు అహల్య ముందుచూపుతోనే చెప్పి ఉంటుంది.

ఎలాంటి ఆశలు పెట్టుకోకుండా నీ పిల్లలను లేడి పిల్లల్లా పెంచమంది. తనకు పెద్ద ఆశలు లేవు. కానీ పిల్లలు దూరమవుతారంటే ఎక్కడో ఆ పేగుబంధం మూలుగుతోంది. ఒక్కోసారి ఆ మూలుగు భీకరంగా తన శరీరమంతా మారు మోగుతుంటుంది. ఒక మహా శూన్యం మనసంతా కమ్మేస్తుంది. కంటి ముందు వెలుగుతున్న చందమామలు ఒక్కసారి మాయమైతే అంతా చిమ్మచీకటే కదా-

ఆ చీకట్లో తన చేయి పట్టుకొని నడిపించేదెవరు?

"నేను లేనా తల్లీ" భూదేవి ఆత్మీయంగా పలికిన పలుకుకు మళ్ళీ వెయ్యేనుగుల బలం.

తన తల్లి స్వతంత్రురాలు. తాను తల్లి దగ్గరకు వెళ్తుంది. తన తల్లి సర్వశక్తిమంతురాలు. అందువల్ల తనను ఆదరించి అక్కున చేర్చుకునే అవకాశం ఉంది. పుత్రులు, పితరులు, పితృవాక్య పరిపాలన, పాతివ్రత్యం, మాతృత్వం అన్నీ చూసింది తను. తాను ఎరుగని కోణం, అహల్య, శూర్పణఖ, ఊర్మిళ ఎవరూ ఎరుగని అనుభవం రేణుకది. కన్న కుమారుని క్రౌర్యాన్ని చూసింది రేణుక. తండ్రి చెప్పిన మాట వేద వాక్యంగా భావించి తల్లి తల తెగనరకటానికి సిద్ధమైన కుమారుడి ధర్మబద్ధ క్రౌర్యాన్ని చూసింది. ఆ క్రౌర్యానికి పునాదిగా నిలచినదేమిటో గ్రహించింది. అప్పుడామెలో ఎన్ని సుడిగుండాలు రేగాయో, వాటి లోతెంతో. ఎంతంటే- ఆర్య ధర్మాలనే సవాలు చేసేంత.

తనకు అంత శక్తి ఉందా? వంశానికి వంశాంకురాలను అందించి నిర్మమకారంగా తన తల్లి ఒడి చేరటం. అంతే. కానీ ఆ చర్య ఆర్యధర్మాలను ధిక్కరించటమే కదా.

శూర్పణఖ, అహల్య, రేణుక, ఊర్మిళ ఒక్కొక్కరిది ఒక్కొక్క కథ. ఒక్కొక్కరిది ఒక్కొక్క త్రోవ. తన మార్గం తన పద్ధతి తనది.

వారందరి అనుభవాలనుంచి తను నేర్వగలిగింది నేర్చింది. మొదట అందరి ఎడలా తనకు నిరసన, కోపం. తర్వాత అందరి జీవితాలలోని వ్యధలూ సమానమేనని తెలిశాక సామరస్యం. స్నేహం. తనవంటివారి బాధలు విన్నాక తానొంటరి కాదనే ఒక బలం. స్త్రీల సమూహంలో తానొకతెననే స్పృహ. అది యిచ్చిన ధైర్యంతోనే అంత నిందతో, యిరువురి సుతుల గర్భాన్ని మోయగలిగింది. వారిని ఆనందంగా పెంచగలిగింది. అన్ని విద్యలూ నేర్పగలిగింది.

సీత ఆలోచనలను తెంచుతూ వాల్మీకి వచ్చాడు. ఆయనకు ఆసనం పరిచి మర్యాదలు చేసింది.

"అమ్మా- రాముడు అంతా గ్రహించాడు. లవకుశులను తన కుమారులుగా గుర్తించాడు. వారిని సగౌరవంగా స్వీకరించటానికి సిద్ధమయ్యాడు."

వాల్మీకి కంఠంలో నిండుగా ఆనందం. ఆయన కర్తవ్యం ఆయన నెరవేర్చాడు. శ్రీరాముని పిల్లలు, తన కథానాయకుని తనయులు తన ఆశ్రమంలో సుశిక్షితులై తండ్రిని చేరబోతున్నారు. తన కావ్యం తండ్రీపుత్రుల కలయికతో సుఖాంతం కాబోతుందనే ఉద్వేగంతో ఉత్సాహంతో ఉన్నాడు.

సీత తొణకకుండా "మంచిదే కదా మునీశ్వరా" అని ఊరుకుంది. అప్పుడాయన ఆనందానికి ఆనకట్ట పడింది.

సీత సంగతి తేలాలి కదా- కొంచెం తొట్రుపాటు పడ్డాడు.

"అమ్మా- రాముడు నిన్ను సభకు వచ్చి సభికులందరి ముందూ, సత్యం పలకమన్నాడు. ఆపై నీవిక పట్టమహిషివి. తర్వాత వీరమాతవు, రాజమాతవు" సీతకు పగలబడి నవ్వాలనిపించింది.

వాల్మీకి మీదనున్న గౌరవంతో నిగ్రహించుకుని- చిరునవ్వు చెక్కుచెదరనీయక.

"నాకంత అవసరం ఉందంటారా? ఆ ప్రయాసకు అర్ధముందంటారా?"

వాల్మీకి నోట మాట రాలేదు. కానీ సీత స్థిర, స్థిత, అంతరంగం అర్ధమైంది.

"నీకు చెప్పే శక్తి, సాహసం నాకు లేవు. తల్లీ" అంటూ సీత తలపై చేయి వేసి మనసులోనే దీవించి వెళ్ళిపోయాడు.

సీత లవకుశులు రాకముందే తన ప్రయాణ సన్నాహాలు పూర్తి కావాలని ఆ పనిలో పడింది. వీడ్కోలు చెప్పవలసినవాళ్ళు అనేక మంది ఉన్నారు.

***

లవకుశులు వచ్చి తల్లి లేని తమ ఆశ్రమ కుటీరాన్ని చూసి ఖిన్నులయ్యారు. వారికిపుడు సర్వం తెలుసు.

తల్లి గురించి అడిగేందుకు ఆవేశంగా వాల్మీకి దగ్గరకు నడిచారు.

వాల్మీకి సీత మాటలు వారికి చెప్పాడు.

వారికి మొదటిసారి తల్లిమీద ఆగ్రహం వచ్చింది.

తండ్రి చెప్పినట్లు ఒక్కసారి నిండు సభలో మాట్లాడి తన నిర్దోషిత్వం నిరూపించుకుంటే ఎంత బాగుండేది. తమకెంత బాగుండేది. ఆ చిన్నారుల గుండెల్లో సన్నని మంట.

వారిపుడు ఋష్యాశ్రమంలో పెరిగే పసికూనలు కాదు. ఆర్యపుత్రులు. రాకుమారులు. కాబోయే భూపాలకులు. భూపుత్రిక సీత వారికి ఎప్పటికైనా అర్ధమవుతుందో లేదో.

---

సాహితీ ప్రస్థానం, జనవరి 2010